

# పరీక్షా ఫలితాలు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧

కాలాన్ని అనుసరించి కష్టసుఖాలు మారిపోతూ ఉంటవి. పురాణాదులలో వినే గురుకులాలు నిజంగా ఎప్పుడైనా మనదేశంలో ఉండిఉన్నట్లయితే వాటిల్లో చదువుకొనే విద్యార్థులకు ఏవిషయాలల్లో ఎక్కువ ఉత్కంఠ ఉండేదో! బహుశహా వాళ్లల్లో ఛాందసు లైనవాళ్లు తమ గురువులను, గురుపత్ను లను సమిత్కుశ పుష్పాదులు సకాలాన అందించి సంతోషపెట్ట యత్నించేవాళ్లు. కాని ఆలోచించగా ఆకాలంలో చెప్పుకునే చదువుకంటే గురువు లను చూసి నేర్చుకొనే చదువే ఎక్కువై ఉండేదని తోస్తుంది. అప్పుడు రోమను గ్రీకు బ్రిటిషు హిస్టరీలూ, వరల్డు జాగ్రఫీలూ, షేక్స్పియరు మొదలైన ఇంగ్లీషు పుస్తకాలూ ఏమీ లేవుగా? అప్పటికి కాళిదాసాదులుకూడా పుట్టలే దనుకుంటాను. కాబట్టి అప్పటికి సంస్కృతభాష. నేర్పడానికి ఉన్న నాలుగైదు పుస్తకా లేవో కాస్త చదువుకొని ఏ వేదాంత శాస్త్రంలోకో దిగేవాళ్లు. అందువల్ల సామాన్య విద్యార్థులకు చదువుకొనే వేళలకంటె తీరిక వేళలే ఎక్కువ ఉండేవి. సంవత్సరం సంవత్సరమూ పరీక్ష లుండేవి కావు. ఆ గురుకులాలలో బాలురే కాక బాలికలు కూడా ఉండేవాళ్లు. అందరికీ ఆరోగ్య మెక్కువ. నాకు చూడగా అటువంటి అమాయికులైన బాలురూ బాలికలూ కలిసిఉంటే స్వచ్ఛమైన ఆదాము హవ్వల ప్రణయములతోనూ, తత్సంబంధమైన ఆందోళనములతోనూ కాలము గడచిపోయే దని తోస్తుంది.

అటువంటి హృదయపరీక్షల బాధలతో చలించిన గురుకుల విద్యార్థులు అనారోగ్యవంతు లైన ఈ కాలపు విద్యార్థులు పడే పరీక్షల అదుర్దా చూస్తే నవ్వక పోరు. కామినీ కాంచనములు లభించడములో వినియోగించవలసిన శ్రమ అంతా నిస్సారపు పరీక్షల కోసము వినియోగించే యువకులను చూస్తే ఎవరికి మాత్రము నవ్వురాదు! మహాదుర్గములు అవలీలగా ఛేదించే శతఘ్నులను నాటకశాలపై ప్రయోగిస్తే ఎట్లాగుంటుంది!

ఎవ రెంత నవ్వుకున్నా సరే, ఈకాలపు విద్యార్థికి లోకములో ప్రప్రధానమైన పదార్థము 'పరీక్ష.' ఎవరైనా కొంచె మారోగ్యం గలవాళ్లు ఏ చిన్నదాని కటాక్షపాతముకోసమో సంవత్సరపు మొదటిరోజులలో అప్పుడప్పుడు వీథులవెంట తారాడినప్పటికీ పరీక్షాగ్ని ముందు సమస్తమైన ప్రేమేంధనములూ భస్మమైపోతవి. పుష్పబాణుడు పడగల ప్రయాస అంతా

పడి ప్రకృతిసిద్ధముగా వజ్రకఠినమైన కన్యకల హృదయాలను సాధించి రవ్వంత ద్రవింపజేసే సమయానికల్లా ఏ పరీక్షో వస్తుంది. వెంటనే ఆవిద్యార్థి పరుగెత్తుకొని పోయి భీష్మిస్తాడు. పరీక్షకు చదువుతున్న విద్యార్థి గదిలోనికి మన్మథుడు పోయినాడా, మళ్లీ అతనికి పురాణ కాలంలో శివుడు తపస్సు చేసుకుంటున్న వనంలో అడుగుపెట్టినరోజు తలపుకు రావలసిందే. అందువల్లనే ఈకాలమంతా పేలవమైపోయింది. పరీక్షగా కావలెనంటే యాభైయేళ్లు దాటిన వాళ్లు చిన్నతనంలో ఏమేమి విచిత్రక్రీడలు చేసేవారో అడిగిచూడండి!

ఎట్లాగో, పరీక్ష లైపోతవి. రిజల్ట్సు వచ్చే రోజులు వస్తవి. ఇక ఆరోజుల్లో రైలు స్టేషనుకు పరుగెత్తేవాళ్లూ, రైలు లేని ఊళ్లల్లో ఎంతెంత దూరమో అందు కని నడిచివచ్చేవాళ్లూ అందరూ సామాన్యంగా చూసే విషయమే. మరీ నా చిన్నతనంలో చిత్రచిత్రాలుగా చెప్పుకునేవాళ్లు. పరీక్ష తప్పిన కొడుకులనుచూచి కౌగిలించుకొని తల్లిదండ్రులు బావురని ఏడవడమూ, బావిలో పడతానని పరుగెత్తుకొని పోయే పిల్లవాణ్ణి నలుగురూ బలవంతాన పట్టుకొని ఆపడమూ జరుగుతుండేవి. కొద్దికాలము కిందటనే మృత్యువు ప్రవేశించిన ఇంటికీ, కొత్తగా పరీక్ష తప్పిపోయిన పిల్లవాడున్న ఇంటికీ ఎక్కువ భేదముండేది కాదు. ఉన్నా రెండవరకము ఇల్లే ఎక్కువ భయంకరంగా ఉండేదేమో! దానికి తగినట్లుగానే ఆరోజుల్లో పరీక్ష తప్పడముకూడా మంచినీళ్లప్రాయంగా ఉండేది. మెట్రిక్యులేషనుకు పదిసార్లూ, పదిహేనుసార్లూ వెళ్లి తప్పినవాళ్ల కథలు వినేవాళ్లము. ఒకాయన పదిహేనోసారి పరీక్షకు వెళ్లి ప్యాసయినాడుట. అది ప్యాసయినట్లు తెలిసిన మూడవ నాటికే ఆపరీక్ష రద్దుచేసి మళ్లీ పరీక్షపెట్టినట్లు కబురు వచ్చింది. మళ్లీ పరీక్షకు వెళ్లినాడు. కాని ఒకసారి ప్యాసయినది మళ్లీ ఒకసారి ప్యాసుకావడము ఆయన ధీరోదాత్తతకు కళంకమని జీవితకాలంలో ఆయన ఆపరీక్ష మళ్లీ ప్యాసు కానేలేదు. ఇప్పుడు పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తూ పేదవాళ్లను వేధించుకొని తింటున్నవాళ్లు కూడా ఎప్పుడో ఒకసారి ఇది అనుభవించి ఉండకపోరు.

క్రైస్తవులకు ఒక నమ్మక మున్నది. లోకము సమాప్తి ఐన తర్వాత సమాధులలో నిద్రిస్తున్న ఆత్మలనన్నింటినీ గాబ్రియేలు తన కబ్బతో తట్టి పైకి పిలుస్తాడు. కొండకోనలలోనూ, అరణ్య వృక్షములలోనూ, ఎడారి ఇసుకలలోనూ, నదీ జలములలో, సముద్రరత్నములలో, భస్మరాసులలో, శాస్త్రీయ సమాధులలో, ఎక్కడెక్కడ నిద్రిస్తున్న ఆత్మలూ అన్నీ దేవుని ఎదటికి వచ్చి విచారణకోసము నిలుస్తవి. దేవుని పక్కనే భానుసహస్రోజ్జ్వలమైన సింహాసనముపైని అధిష్ఠించి ఏసుక్రీస్తు దేవునికి ఎవరు క్రైస్తవులో, ఎవరు కారో నిరూపించి చెప్పుతూ ఉంటాడు. అందులో క్రైస్తవులైనవాళ్లను శాశ్వత స్వర్గములోకీ, తక్కినవాళ్లను గంధక ధృతితో నిండిన నరకకోణములోకీ తీసుకొని పొమ్మని దేవుడు తీర్పు చెప్పుతాడు. ఆ తర్వాత దేవుని కెప్పుడూ తీరికే. మళ్లీ తోచక దేవుడింకోసారి లోకాలు సృష్టించాడా, క్రైస్తవుల దేవుడు మన బ్రహ్మదేవుడౌతాడు. కాని ఇదంతా అప్రస్తుత ప్రశంస. ఆరోజు పేరు తీర్పు (జడ్జిమెంటు) రోజు. మన విద్యార్థులకు పరీక్ష ఫలాలు తెలిసేరోజు క్రైస్తవులకు జడ్జిమెంటు రోజువంటిది.

౨

నేను కాస్త ఆరోగ్యవంతులలో ఒకణ్ణి. కాబట్టి ప్రతి పెద్ద పరీక్షా దండయాత్ర ఒకటున్నా చేసి కాని దాటేవాణ్ణిగాదు. అట్లాగే నేను ఇంటరు రెండవసారి పరీక్షకు వెళ్లినప్పుడు విచిత్ర మొకటి జరిగింది. ఆరోజున రిజల్ట్సు వచ్చినవని విని నేను రైలుస్టేషనుకు బయలుదేరినాను. ఆరోగ్యవంతుణ్ణే ఐనా మనసులోని ఆదుర్దా జ్వరము తెప్పిస్తున్నది. పైకి నవ్వుముఖం పెట్టుకొని నిశ్చలంగా ఉన్నట్లుగానే వెళ్లుతున్నాను. ఎందుకు! అప్పటి నాస్థితినే ఈకథ వ్రాస్తున్న ఇప్పటి స్థితి కొంతవరకు అనుకరిస్తున్నది.

నేను ఇంటికి తిరిగివచ్చేటప్పటికి కాస్త పూర్వకాలపుదైన నాభార్య నారాక కాదుర్దాగా ఎదురు

చూస్తూ వాకిట్లో నిలుచుని ఉండనందుకు ఆశ్చర్యపడ్డాను. కాని అప్పటికే పరీక్షాఫలితము మా ఇంట్లో తెలిసిందట. ఆసంవత్సరము మాకు దూరపుబంధువైన నా స్నేహితుడొకాయన పరీక్షకు వెళ్లినాడు. నేను బయటికి వెళ్లిన కాస్తసేపటికే ఆయన జుట్టు విరియబోసుకొని చెమటలు కారుకుంటూ, సింహము తరుముతే పారిపోతున్న మేకపోతువల్లే మా సందు చివర కనపడి, నాకోసము ఎదురుచూస్తూఉన్న నాభార్యకు నేను ప్యాసయిన సంగతి పెద్దగా అరిచి చెప్పినాడుట. నేనింటికి రాగానే ఇది చెప్పి నా భార్యకూడా నవ్వింది. "అయ్యో, నీకు తెలిసింది ఇంతేనా! అసలతనికి ప్యాసయినట్లు నిన్నరాత్రే స్నేహితుడొకడు టెలిగ్రాము ఇచ్చినాడట. అయినా, భయముతో వణుకుతూ, ఇవ్వాళ పొద్దున పోస్టాఫీసుకు వెళ్లి పేపరు తీసుకున్నాడుట. అతను పేపరు చేతుల్లో పట్టుకుంటే తుపానుసమయంలో సముద్రంమీద దోనెవల్లే అది ఎగురులాడిందిట. ఇక నెంబరేం కనపడుతుంది! నెంబరు కనపడక అతను తందనాలాడుతూఉంటే ఎవరో పక్కనున్నవాళ్లు అతనికి నెంబరు చూపి కాస్త శాంతింపజేసినారుట" అని చెప్పి మా వాళ్లను మరింత నవ్వించినాను. పక్కనున్న మా అమ్మగారు కోపపడి "అట్లా ఒకరిని హేళన చేయగూడదురా నాయనా" అనేసరికి నేను మరింతపొట్టఉబ్బేటట్లు నవ్వినాను.

మళ్లీ, బి. ఏ. పరీక్ష మూడవసారి ప్యాసయినాను. అప్పటికి అక్టోబరు పరీక్షలు పెట్టినారు కాబట్టి రెండోసారి ప్యాసయినా, మూడోసారి ప్యాసయినా భేదమేమీ లేదని మూడోసారే ప్యాసయినాను.

ఆరోజున వంటచేస్తూ, నన్ను "రిజల్ట్సువచ్చినయ్యా" అని అడుగుతూన్న నాభార్యవద్దకు వెళ్లి నెమ్మదిగా నేను ప్యాసయినానని చెప్పినాను. నాభార్య నమ్మక "నిజమేనా" అన్నది. నిజమేనని జవాబు చెప్పి గదిలోకి స్నేహితులతో మాట్లాడడానికి శాంతంగా వెళ్లినాను. ఎక్కువ సంతోషం కనపరిస్తే స్నేహితులు నవ్విపోతారని నా బ్రహ్మానందమంతా మరుగుపరిచిన సంగతి నాభార్యకేం తెలుసు! ప్యాసు కాకపోయినా వేషానికి అట్లా చెప్పినానని అనుమానించి నాభార్య ఇంతలోకే అక్కడికివచ్చిన మాఅమ్మగారితో కూడా — తర్వాత నవ్వుబాట్లవుతుందేమో అనే భయంతో — నేను ప్యాసయినసంగతి ప్రశంసించనేలేదట. తనకు సంతోషవార్త వెంటనే వినిపించలేదని నాభార్యమీద మాఅమ్మగారికి తర్వాత కోపంకూడా కాస్త వచ్చి ఎన్నాళ్లదాకానో సాధించింది. కాని ఏదిఎట్లా ఉన్నా ఆపరీక్షలన్నీ నవ్వులతోనే పూర్తిఅయినవి!

ఇవ్వాళపొద్దున్నే నాచిన్నస్నేహితుడైన చంద్రశేఖరం మాఇంటికి వచ్చినాడు. అతను నిన్నరాత్రి భోంచేసిన తర్వాత మా ఇంటివద్దనే ఉన్న ఒకస్నేహితుని ఇంటికి కబుర్లకు వెన్నెట్లో షికారువచ్చినాడు. నేనూ వెళ్లి కాసేపు మాట్లాడి ఇంటికివచ్చాను. కాని చంద్రశేఖరం చాలాసేపటిదాకా మాట్లాడుతూ అక్కడే ఉండి చివరకు పొద్దుపోయిందని అక్కడే పడుకుని నిద్రపోయినాడుట. అందువల్ల పొద్దున్నే వచ్చిన చంద్రుణ్ణిచూస్తే నాకు ఆశ్చర్యంతోకూడిన సంతోషం కలిగింది. పొద్దున్నే మాఇంటికివస్తే అతను పదీపడకొండన్నాకానిది ఇంటికి వెళ్లుతాడా! కొంతసేపు బజారులో తిరుగుతూనూ, కొంతసేపు ఇంటిదగ్గర కూర్చునీ మాట్లాడుకున్నాము.

చంద్రశేఖరం సగంవరకూ మాత్రమే వ్రాసినకథ ఒకటి నావద్దఉన్నది. అతను ఇంటికి వెళ్లబోయేటప్పుడు దానిని అతని చేతికిచ్చి "చంద్రా, నీ వీకథ ఇవ్వాళ పూర్తిచెయ్యి. మీపరీక్ష రిజల్ట్సు రాకముందే ఇది పూర్తి అవుతే బాగుంటుంది!" అన్నాను.

"ఇప్పుడు నేనది వ్రాయలేనండీ! అంతగా ఐతే మీరే అదిపూర్తిచేసి మీపేర ప్రచురించుకోండి" అన్నాడు చంద్రుడు.

"ఎబ్బె! నీకథ పూర్తిచేయగలనని నాకూ ధైర్యమున్నదికాని నాకథలు నాకులేకనా!" అన్నాను.

"ఏమోనండీ పిచ్చికథ!" అని విసుక్కున్నాడు చంద్రుడు.

"ఇంతమాత్రానికే ఇంత విసుక్కుంటే ఎట్లాగోయి? ముందుముందు నీకథలతో తెలుగుదేశమంతా తల్లకిందులు చేయదలచుకుంటూ ఉంటే!" అన్నాను.

"మీ రెప్పుడూ ఇట్లాగే అంటారు. నా కాశక్తి లేదు" అన్నాడు చంద్రుడు.

"నీకేం తెలుసునోయి!" అని నిశ్చలంగా అన్నాను.

"అయితే ఈకథ బాగుంటుం దంటారా?"

"అద్భుతంగా! ఇవ్వాళ సాయంత్రానికే నీ విది పూర్తిచేయాలి! వ్రాసినభాగం రెండుమూడుసార్లు చదివి కాని పైన వ్రాయ మొదలు పెట్టబోకు! లేకపోతే అతుకుపడుతుంది" అన్నాను.

"సరే, చూస్తానులెండి" అన్నాడు చంద్రుడు.

చంద్రుడు చూస్తా నంటే చూసినట్లే నని నాకు తెలుసును. కాబట్టి నే నామాటలకు సంతోషించి "సాయంత్రం నీకోసము ఎదురుచూస్తూ ఉంటాను" అన్నాను.

"చూస్తూ ఉండవచ్చు" అన్నాడు.

పొద్దెక్కిం దని ఇంటికి బయలుదేరుతూ చంద్రుడు నన్నూ బయలుదేర మన్నాడు. చంద్రుడి ఇంటికీ, మా ఇంటికీ మైలుదూర ముంటుంది. మా ఇళ్లకు సుమారు మధ్యలో వేపచెట్టొకటి ఉన్నది. ఎప్పుడూ అక్కడిదాకా ఒకరి నొకరము పంపుకొని కాస్త మజిలీ చేసి మా మా ఇళ్లకు వెళ్లే మామూలు. ఆ చెట్టు కింది వంతెన మునిసిపాలిటీవాళ్లు మా వుపయోగార్థమే కట్టించినట్లు తోస్తుంది.

కాని ఇవ్వాళ మా ఇంటికి నాకు కౌముది చెప్పిన ఆచార్యులుగారు వచ్చిఉన్నారు. అప్పుడాయన సంధ్యావందనము చేసుకుంటూఉన్నా త్వరలోనే పూర్తిఔతుందికాబట్టి అప్పటికి నే నింట్లో ఉండకపోతే బాగుండ దని ఇవ్వాళ నేను నా స్నేహితుణ్ణిమా వేపచెట్టుదాకాకూడా పంప దలచుకోలేదు. ఐనా, వాకిట్లోకి రాగానే చంద్రుడు "ఇవ్వాళ మీరు నన్ను చాలాదూరం పంపించవలసి ఉంటుంది!" అన్నాడు. ఆచార్యులుగారిని విడిచిపెట్టి నేను రావడం బాగుండ దని చూస్తూఉన్నా, అతను ఇట్లా అడిగినా డేమని నవ్వుకున్నాను. కారణ మేమీ లేకుండానే అత డట్లా తెలివితక్కువగా అడిగినా డని తెలుసును. కాని డాబుగా "ఓ! నీవు రమ్మంటే ఎంతదూరం పడితే అంతదూరం వస్తాను. అవసరమైతే మీ ఇంటిదాకా కూడా వస్తాను" అని, ఆరోగ్యవంతుణ్ణి కాబట్టి ముందు సంగతి ఆలోచించుకోకుండా బయలుదేరినాను.

కాస్త దూరం వెళ్లినామో లేదో, ఒక కుఱ్ఱవా డెదురుపడి "చంద్రశేఖరం! ప్యాసయినావా?" అని అడావిడిగా అడిగినాడు. మేమిద్దరమూ పొద్దున బజారంతా తిరిగినా ఇంటరురిజల్ట్సు వచ్చినట్లు మాకు తెలియనేలేదు. ఆకుఱ్ఱవానివల్ల అది తెలుసుకొని పేపరు వచ్చే దగ్గిరచోటికి బయలుదేరినాము. అది మా మజిలీ వేపచెట్టుకు సమీపంలోనే ఉన్నది.

చంద్రుడు వణకసాగినాడు. అతన్ని చూస్తే నాకూ కాలు నిలవలేదు. నాపరీక్షరిజల్ట్సు చూడబోయేటప్పుడెప్పుడూ ఇంత ఆవేగము నేను అనుభవించి ఎరగను.

చంద్రుడు నాబుజంమీద చేయివేసి "చూశారా! నే నివ్వాళపొద్దుటినుంచీ ఇంటికి రాకపోవడానికి కారణం పరీక్ష తప్పడమే అనుకుంటారు మావాళ్లు!" అన్నాడు.

"అనుకుంటేమాత్రం నీ కేమి లోపం! నీ వంత బాగా చదివినప్పటికీ మీవాళ్లు నీవు చదవక సంవత్సరమంతా పాడుచేశావనే ఉద్దేశంతోనే ఉన్నారా! ఏంజేస్తాము! ఐనా ఇవ్వాళ నీ వింటికిపోయి ప్యాసయిన కబురే చెప్పుతావుగా!" అన్నాను.

"అందుకుగాదు, చూడండీ! ప్రతిదీ ఇట్లా వస్తున్నందుకు చెప్పుతున్నాను. నేను పరీక్షప్యాసు కాకపోవడము నిశ్చయం లెండి!"

"పిచ్చా ఏమిటి? నీవు పరీక్ష తప్పడ మెట్లా సాధ్యమవుతుందోయి! అన్నిటికంటే బాగా చదివిన ఫిజిక్సులోనేగా నీవు తప్పుతా నని భయపడేది!"

"ఎంతబాగా చదివితే మాత్రం! చదువును చూసి మార్కులిస్తారా? నేనెంత అసహ్యంగా వ్రాశానో మీకేం తెలుసు!" అన్నాడు.

"నీ వెంత బాగా వ్రాశావో నీకేం తెలుసు! నీ కెప్పుడూ అధైర్యము లేనిది?" అన్నాను. కాని నామాటల్లో కనపడే ధైర్యము నాలోకాని, అతని మాటల్లో కనపడే అధైర్యము అతనిలో గాని లేవు. అతనికి ఆశా ఉన్నది. నాకు అధైర్యమూ ఉన్నది.

ఇంతలోనే పేపరుండేచోటు సమీపించినాము. అప్పుడకస్మాత్తుగా చంద్రుడు జేబులోనుంచి అసంపూర్ణమైన తన కథకాగితాలు తీసి చింపబోయేవాని వలె పట్టుకొని "నేను పరీక్షప్యాసుకాకపోతేనా, ఇవి ముక్కలు ముక్కలుగా చింపివేస్తాను" అన్నాడు. అ కథపేరు 'విషప్రయోగము.'

నేను నవ్వి "అది మాత్రము వద్దు. ఇరవైసార్లు పరీక్ష తప్పనన్నా తప్పు కాని అంకచక్కని కథ నీవు చింపితే నేను ఓర్చలేను" అన్నాను.

"చూస్తూఉండండి!" అన్నాడు.

"బెదిరింపా ఏమిటి? ఎవరిని రక్షించడానికి?" అని కోపపడ్డాను. ఇతను పరీక్ష తప్పుతాడేమో, కథ చింపుతాడేమో అనేభయం ఆసమయంలో నాకు కూడా రాక ఊరుకున్నది కాదు. ఐనా నేను దగ్గిర ఉంటే అతను కథ చింపకుండా చేయగలనని నాకు ధైర్యమున్నది. నా వాక్చాతుర్యమంతా అతని యెడల ఒకవేళ నిష్ప్రయోజనమైనా, ఆరోగ్యవంతుణ్ణి ఐన నా భుజబలమేమై పోతుంది! చంద్రుని కథను రక్షించగలిగినట్లే అతని పరీక్షాఫలితాన్నికూడా నా వశవర్తిని చేసుకోగల శక్తి ఉంటే ఎంత బాగుండేది!

## 3

ఇంతవరకూ విన్నవాళ్లకు యఫ్.యల్.క్లాసులో ఉన్న నాకూ, ఇంటరు క్లాసులో ఉన్న చంద్రుడికీ ఇంత స్నేహ మెట్లా అయిందో చులకనగా తెలుస్తుంది. కథలు వ్రాస్తున్న పిచ్చి నాకూ, వ్రాయగల పిచ్చి అతనికీ ఉన్నదాయె మరి! ఇంత స్పష్టమైన విషయమే అయినా అట్లా అనుకొని నాస్నేహితులు గాని,అతని స్నేహితులుగాని సరిపెట్టుకొని ఊరుకుండేవాళ్లు కారు. "చంద్రుడి కెప్పుడూ పెద్దసావాసాలు" అని ఏమేమో అతని స్నేహితులు అతనిని ఎక్కిరించేవాళ్లు. నా స్నేహితులలో చాలామంది చంద్రుణ్ణి నాకంటె ముందటినుంచీ ఎరుగుదురు. వాళ్లంతా అతన్ని 'ఏమిరా' అని పిలుచుకుంటూ కుఱ్ఱవాణ్ణిగా చూసేవాళ్లు. ఎవరన్నా కొత్తవాళ్లు చంద్రుణ్ణి చూపించి ఇతనెవరని అడిగితే "ఇతనా, తెలుగుదేశములో కథకులలో అగ్రస్థానము అలంకరించబోతున్న చిన్నవాడు" అని అత్యాదరంతో పలికేవాణ్ణి. ఆమాటలు విన్న నా స్నేహితులకు కన్నెఱ్ఱగా ఉండేది. వాళ్లను నే నెప్పుడైనా పొగడిన పాపానపోయి ఎరగను,పాపము! "చంద్రుడికి అసలే అహంకారంఉంటే, నీవు ఇట్లా పొగడితే ఇంక అతను బాగుపడతాడా! కుఱ్ఱవాణ్ణి పూర్తిగా చెడగొట్టదలచుకున్నావా ఏమిటి?" అని ఒకస్నేహితుడు నాతో మాటిమాటికీ అంటూఉండేవాడు.

దీనికి పూర్వగాథ ఒకటిఉన్నది. ఒకసారి చంద్రుడూ, నేనూ చెన్నపట్టణం వెళ్లుతూ రైలులో ఇదీ అదీ మాట్లాడుకుంటున్నాము. అప్పుడేదోమాటల సందర్భాన చంద్రుడు "ఈ లాకాలేజిలో ఉన్న మొద్దు బి.ఏ.ల కంటె నేను కనాకష్టముటండీ!" అని అనడము పక్కనే కూచునిఉన్న ఆ స్నేహితుడు విన్నాడు. మొద్దు బి. ఏ. లలో ఒకడైన ఆ స్నేహితునికి ఎక్కడలేని కోపమూ వచ్చి ఏదో మాటచేసుకున్నాడు. కాని నేను మధ్య అడ్డముతగిలి "మేము విడిగా మాట్లాడుకుంటున్నమాటలు వినడము మీకు ధర్మముగాదు. ఒకవేళ విన్నా ఆవిషయము తర్కించగూడదు" అన్నాను. నాసలహా అర్థముచేసుకోగలవాడే అవుతే చంద్రుని మాటల కతనికి రోషము వచ్చేదేకాదు. చెన్నపట్టణం వెళ్లినతర్వాత అతనికి తెలిసిన లాకాలేజివిద్యార్థుల కందరికీ ఇది చాటించినాడు. వాళ్లది లాకాలేజి విద్యార్థులనందరినీ తిట్టినట్లుగానే భావించి చంద్రశేఖరానికి శాస్తి ఐతే బాగుండు ననుకునేవాళ్లు. "అతను ఈ సంవత్సరము తప్పితేనన్నా కొస్త పొగరు తగ్గుతుందేమో" అనేవాళ్లు. ఆమాట లెప్పుడైనా నాచెవుల బడితే నేను నవ్వి "మీ కందరికీ ఆకుఱ్ఱవాడిమీద ఇంత అకారణమైన ఆగ్రహ మెందుకండీ! ఐనా మీ రెంత తిట్టినా అతను ఫస్టుక్లాసులో డిస్టింక్షనులతో సహా ప్యాసవుతాడు, తప్పదు!" అనేవాణ్ణి.

"ఎందుకులే, అతన్నని ఏమిలాభము! ఇంతకూ నువ్వూ అతన్ని పాడుచేస్తున్నది!" అనేవాళ్లు నాతో కాస్త స్వతంత్ర మున్నవాళ్లు.

ఆమాటలకు నేను మరింత నవ్వేవాణ్ణి. వాళ్లకు మరింత రోషము వచ్చేది.

ఈ సంవత్సరము మొదటినుంచీ చంద్రుణ్ణి అప్పుడప్పుడు కలుసుకొని ఆదరంగా మాట్లాడుతుండే వాణ్ణి. అతనిలో ఏమిటో నన్ను ఆకర్షించింది. ఎంత ఉత్సాహంగా మాట్లాడుతూ ఉన్నా ఇంత కొద్దికాలంలో అతనితో ఇంత గాఢస్నేహము కలుగుతుందని అప్పుడెన్నడూ నే ననుకోలేదు. నాకే ఆశ్చర్యము వేస్తుంది. ఇప్పుడు చంద్రుడితో ఒక్కరోజు మాట్లాడకపోయినా ఏదో కొరతగానే ఉంటుంది. అప్పుడు ఎంత అనురాగమున్నట్లు మాట్లాడుతూఉన్నా ఇవతలికి వచ్చినతర్వాత అతన్నీ, అతనితో మాట్లాడిన మాటలనూ పూర్తిగా మరిచిపోయేవాణ్ణి. కాని అప్పటికే నాస్నేహితులకు నేను అంతచిన్నవాడితో అంత ఆదరంగా మాట్లాడడ మేమి టని ఆశ్చర్యంగా ఉండేది.

కాని చంద్రుని స్నేహితులకు గాని, నాస్నేహితులకు గాని, మా ఇద్దరినీ ఏమాత్రమైనా ఎరిగిన వాళ్లకు గాని చంద్రుడు విక్టోరియాహాస్టలు విడిచిపెట్టి నాతో వేరే గదిలో ఉండడానికి వచ్చినప్పుడు కలిగినంత ఆశ్చర్యం మరెప్పుడూ నేను చూడలేదు. మేము పూటకూటింటికి భోంచేయడానికి వెళ్లినప్పుడు కొత్తరోజుల్లో "ఏమండీ చంద్రశేఖరంగారూ, అంతా హాస్టల్లో ఉండటానికి ప్రయత్నిస్తూఉంటే మీ రది విడిచిబెట్టి హోటల్లో మాతోపాటు అవస్థపడటానికి వచ్చా రేమండీ?" అని చిత్రవిచిత్రాలుగా అడిగేవాళ్లు. వాళ్లల్లో కొంతమందికి ఆశ్చర్యమూ, ఎక్కువమందికి హేళనా, ఏదో కొద్దిమందికి ఈషద్విచారమూ. వాళ్లప్రశ్నలకు తగినట్లుగానే చంద్రుడు కూడా "ఊఁ, పిచ్చిపుట్టి వచ్చానండీ" అని విసుగుగా జవాబు చెప్పేవాడు. ఇంకా పట్టుదల కాస్త ఎక్కువ గలవాళ్లు "ఇదేంపిచ్చి అండీ"అంటే "ఏముందీ, పిచ్చి అని చెప్పలా?" అనేవాడు.

ఈ సందర్భంలో పూర్వకాలం చెన్నపట్టణములో విద్యార్థులకు విక్టోరియా హాస్టలు స్వర్గతుల్యమైనదని చెప్పకపోతే ఎందుకు వాళ్లంతా అంత ఆశ్చర్యపడ్డారో చాలామందికి అర్థం కాకపోవచ్చును. మూడు సంవత్సరాలు పట్నంలో విద్యార్థిగా గడపిన నాకే చంద్రుడు హాస్టలు విడిచిపెట్టి వచ్చిన కొద్దిరోజులదాకా అక్కడ సమస్తమైన వసతులూ ఉంటవని తెలియదు. తెలిసినట్లయితే అతన్ని హాస్టలు విడిచి రానిచ్చేవాణ్ణేకాదు. అది ఇట్లాజరిగింది.

మేము దసరా సెలవుల్లో మాఊరు వచ్చినప్పుడు ఒకనాడు సాయంత్రం చంద్రుడూ, నేనూ కలుసుకున్నాము. అప్పుడు ఆ సంగతులూ ఈ సంగతులూ మాట్లాడుకోవడంలో చంద్రుడు "ఈ మధ్య మీకథలు కొన్ని చదివినా నండోయ్!" అన్నాడు. నేను కాస్త సంతోషంచూపే నవ్వుతో తల ఎత్తేటప్పటి కల్లా "నా కొక్కటీ నచ్చలేదు సుమా!" అనికూడా చేర్చినాడు. ఇట్లా మాట్లాడి ఎదటివాళ్లను చీకాకు పరచడం చంద్రునికభ్యాసము. నా కది ఎంచువల్లనో సంతోషం కలిగించేదేకాని చాలామందికి మల్లే కోపం తెప్పించేది కాదు. అదిగాక నేను వ్రాసినవి ఇతరులు దూషించడం వినడానికి నేను మొదటినుంచీ అలవాటుపడిఉన్నాను. కాబట్టి చంద్రుడు పలికిన ఆమాటలకు నేను మరింత నవ్వుతూ "అట్లాగా, సంతోషమే!" అని నిశ్చలంగా అన్నాను. ఇంకా కొంత సేపు నన్ను ఉడికించవలెనని చూసినాడు గాని అతని కది సాధ్యం కాలేదు.

ఆ సాయంత్రం నన్ను విడిచి వెళ్లేలోపల అతను "నేను హాస్టలు విడిచిపెట్టి విడిగా ఉందామని చాలా రోజులబట్టీ అనుకుంటున్నాను. వార్డెను కివ్వాళ ఉత్తరంకూడా వ్రాసినాను." అన్నాడు.

"మంచి పని చేశావు!" అన్నాను. చెడ్డపని చేశావని స్నేహితులవిషయంలో నానోట సామాన్యంగా రాదు.

"ఐతే నేను చేసినది తొందరపని కాదంటారు గదా!" అన్నాడు.

"పాడుహాస్టలు విడిచిపెట్టడము తొందరపని ఎట్లా అవుతుంది!" అన్నాను.

"ఐతే మరి మన మిద్దరమూ ఒకచోటనే ఉండామా? అందుకు మీకు అభ్యంతరం లేదుగదా!" అన్నాడు.

నా కప్పుడు చెన్నపట్టణంలో గదిలేదు. గది కొత్తగా మళ్లీ వెతుక్కోవలె కాబట్టి సంకోచం లేకుండా "అభ్యంతరం లేకపోవడమే కాక నీ వున్న చోట ఉండడానికి నాకు సంతోషంకూడాను" అన్నాను, ఇంగ్లీషు వాక్యాల ధోరణి ననుసరించి.

అప్పుడు నామనస్సులో హాస్టలంటే వందల కొద్దీ పిల్లలు మందలుమందలుగా ఉండే స్థలమనీ, రోజూ రాత్రి తొమ్మిదింటికి బందిఖానాలోని ఖయిదీలవలె వారు హాజరుచెప్పుకుంటూ ఉండవలెననీ, చదువూ సంధ్యా లేక అల్లరిచేస్తూ కాలము వెళ్లబుచ్చే స్థలమనీ అభిప్రాయమే కాని అక్కడ ఉండే సౌకర్యాల విషయం నాకు బాగా తెలియదు. ఒకవేళ కొన్ని సౌకర్యాలు ఉన్నా ఏమాత్రపు ఆత్మగౌరవము గల వాళ్లయినా అక్కడ ఉండలేరని నా నమ్మకము.

చంద్రశేఖరం హాస్టలు విడిచి వచ్చిన కొత్తరోజుల్లో అతనిబంధువొకాయన వొకనాడు నాతో విక్టోరియాహాస్టలు సౌకర్యాల సంగతి మాట్లాడినాడు. మొదట ఆమాటలను నేను హేళన చేసినాను గాని ఆయన చెప్పుతున్న కొద్దీ ఆవిధంగాకూడా కొంతమంది అనుకొనేందుకు అవకాశ మున్నదని తలచి ఓపికతో విన్నాను. "అక్కడ కావలెనంటే అల్లరిచేసేందుకూ పిల్లలు దొరుకుతారు. ఎప్పుడన్నా చదువుకోవలెనని బుద్ధిపుట్టి గదిలో పోయి కూర్చుంటే ఆటంక పెట్టేవాళ్లుండరు. రీడింగురూముకు మనదేశపువేగాక అమెరికావీ, ఇంగ్లండువీకూడా మంచిమంచి పత్రికలు వస్తవి. లైబ్రరీ మంచిది. ఇక అక్కడ ఉండే విద్యార్థులు! ముందుముందు దేశంలో పైకి వచ్చేవాళ్లు చాలామట్టుకు అక్కడే ఉంటారు. వాళ్లతో సంభాషించడమే ఒక గొప్పచదువు! ఇంత ఎందుకండీ! అక్కడ ఒకసంవత్సర మున్న తర్వాతనేగా నాలో పెద్ద వికాసమూ, స్వతంత్ర బుద్ధీ ఏర్పడ్డవి! ఇక స్నానానికీ భోజనానికీ ఎంత పరిశుభ్రంగా ఉంటుంది! గదులలోకి గాలి కాస్త తక్కువ వచ్చినా వరాండాలోకి వచ్చి కూర్చుంటే సముద్రపు గాలి రివ్వురివ్వుమని కొట్టుతూ ఉంటుంది. విద్యార్థులకంత హాయైనస్థలము ఇంకొకటి లేదండీ!"

ఆయన నాతో అట్లా మాట్లాడడానికి కారణం చంద్రశేఖరాన్ని హాస్టలువిడిచేటట్లు చేసినందుకు నన్ను కోపపడడానికని నాకు తర్వాత తెలిసింది. ఊరికే ఏదో హాస్టలుసంగతి లోకంలో ఎన్నో ఇతర విషయాలవలెనే మాట్లాడినా డని నే ననుకున్నా గాని వాటికీ, చంద్రుడు హాస్టలు వదలడానికీ ఉన్నసంబంధం నాకప్పుడు తెలియలేదు. చంద్రుణ్ణి హాస్టలు విడిచేటట్లు చేసింది నే ననే సంగతే నాకు తెలియనప్పుడు అందుకని నన్నాయన కోపించవలె నని ప్రయత్నిస్తున్నాడని నాకేం తెలుస్తుంది! ఆరోజుల్లో ఒకటిరెండుసార్లు ఆయన చంద్రునితో "మీ నాన్నగారికి వ్రాస్తా" నని బెదిరించినాడుకూడా నని నాకు చంద్రుడు ఎన్నాళ్లకో చెప్పినప్పుడుకాని ఆయనమాటల అర్థం నాకు పూర్తిగా పాడకట్టనే లేదు.

ఆ చంద్రుని బంధువు హాస్టలులో కొత్తగా ఉండి ఇంటికి వెళ్లిన రోజుల్లో వాళ్లనాన్నగారు ఇల్లొకటి పెద్దది కట్టించవలెనని ఆలోచిస్తూ ఉన్నారట. "నాన్నగారూ, ఇల్లు మామూలువల్లే కట్టగూడదండీ. ఇవన్నీ ఏమి ఇళ్లు! విక్టోరియాహాస్టలువలె ఉండవలెగాని" అని పదేపదే చెప్పుతూ ఉండేవాడని ఈమధ్యనే నాకు చంద్రుడు చెప్పినాడు.

## ౪

దసరా సెలవులు వెళ్లిపోయినతర్వాత నేనూ, చంద్రుడూ కొత్తగా గదులు తీసుకోవలెనని ప్రయత్నిస్తే మంచి వెక్కడా సందర్భించలేదు. చివరకు కష్టపడి వెదకి ఒక్కఇంట్లోనే విడివిడిగా గదులలో ఉందామని రెండుగదులు తీసుకున్నాము. కాని హాస్టలులో నలుగురితో కబుర్లు చెప్పుతూఉండే చంద్రుడు విడిగా గదిలో ఒంటరిగా ఉండలేకపోయినాడు. అతను స్వగ్రామంలోకూడా ప్రత్యేకించి తనకు గది ఉంచుకోక వంట ఇల్లే తన ప్రధానమైన గదిగా ఉంచుకొని ఇంట్లో

వాళ్లతో కభుర్లు చెప్పుతూ చదువుకునేవాడుట. ఇది నేను వెంటనే కనిపెట్టి చంద్రుణ్ణి నాగదిలోనే వచ్చిఉండమని, అతను మొదట ఉన్న గదిలో మా స్నేహితుల నిద్దరిని ప్రవేశపెట్టినాను.

కొద్దిరోజులలోనే ఈరకంగా ఉండడానికి చంద్రుడు అలవాటుపడ్డాడు. హాస్టలులో ఎన్ని సౌకర్యాలు ఉన్నా ఎప్పుడూ పురుషవిద్యార్థులనే చూస్తూ వాళ్లతోనే మాట్లాడుతూఉండడంవల్ల మనుష్యులకు మోటుదనమూ, సంకుచితదృష్టీ అలవాటవుతుంది. దూరదేశములో చదువుకోడానికి వెళ్లే విద్యార్థులు చిన్నవాళ్లైనా ఇంటివద్ద ఉన్నట్లు ఉండే చోట ఉంటేనే బాగుపడతారు కాని, వాళ్లు అనుభవము లేనివాళ్లు కావడంచేత ఏమి చెడిపోతారో అనే భయంతో హాస్టలులో దిగవిడిచి రాత్రిళ్లు బయటికి వెళ్లకుండా ద్వారాలు మూసి స్వేచ్ఛను బంధిస్తే బాగుపడరు. మరీ పసివాళ్లవుతే తప్ప కాస్త బుద్ధివికాసము కలిగినవాళ్ల విషయంలో ఈ నియమాలు శుభప్రదంగా పరిణమించవు. కాస్త వెన్నెలలో సముద్రతీరాన కూర్చోవలెనని బుద్ధిపుట్టినప్పుడో, సినీమాకో నాటకానికో వెళ్లవలెననుకొన్నప్పుడో కారణాలు చెప్పి ముందుగానే చీటీ తీసుకుంటేనేగాని బయటికి వెళ్లే వీలులేదంటే విద్యార్థులే దానికి తగిన సదుపాయాలు కల్పించుకుంటారు. హాస్టలు రెండవ అంతస్తుమీదనుంచి గేటుగోడమీదికి దిగి అక్కడినుంచి కిందికి దిగడానికి ఉన్న దోవ సులువుగా కనిపెట్టుతారు. ఇంత స్వల్పవిషయాలలో దొంగతనానికి పాల్పడడము ఎంత ఘోరమైన విషయమో ఆ విద్యార్థుల కప్పుడు తెలియదు. ఒకసారి గోడదూకిన విద్యార్థి రెండవసారి జంకడు. ఈవిధముగా చాలామంది మొద్దుబారిపోతారు. కాని కోమల ప్రకృతీ, స్వతంత్రబుద్ధీ, ఆత్మగౌరవమూ కలవాళ్ల కిది గిట్టదు. హాస్టలువిడిచినతర్వాత రకరకాల జనులను చూస్తూ వాళ్లతో మాట్లాడుతూ ఉండడంవల్ల చంద్రుడు చెన్నపట్టణంలో మునుపెన్నడూ ఎరగని కొత్త మనస్స్వాస్థ్యము అధిగమించినాడు. దేహసౌకర్యాలు కాస్త తక్కువైనప్పటికీ తాను హాస్టలు విడిచిపెట్టి రావడం మంచిదే ఐనదని తెలుసుకున్నాడు.

చెన్నపట్టణంలో అతనికి మునుపెప్పుడూ ఉండే తలదిమ్ము అతన్ని విడిచిపోసాగింది. అతనికి నెమ్మదిగా చిన్నతనములోని విచిత్రానుభవాలు కన్నులకట్టినట్లు జ్ఞాపకము రాసాగినవి. మేమిద్దరమూ సాయంత్రం సముద్రతీరానికి షికారువెళ్లినప్పుడు తాను చూసినవీ, విన్నవీ, అనుభవించినవీ అద్భుతసందర్భములు ఒక్కటొక్కటే చెప్పసాగినాడు. అతనికి ఏవిషయమైనా స్పష్టముగానూ, మధురముగానూ చెప్పే శక్తి ఉన్నది. అతనిమాటలు వింటూఉన్నకొద్దీ నాకతనిమీద ఆదరము అధికమైనది.

మరీ ఒకరోజున అద్భుతమైన స్వానుభవము చెప్పినాడు. ఆరోజు నాకెన్నటికీ మరుపురాదు. ఆ సాయంత్రము అతనిమాటలు విన్నతర్వాతనే నా కతనిమీదఉన్న అనురాగము గాఢమైనది. ప్రియమిత్రులైన ప్రతివారికీ తమమైత్రిచరిత్రను మనోవీథిలో పునస్సృష్టిచేసుకొని ఆలోడనము చేసుకుంటే అటువంటి సాయంత్రమో, మధ్యాహ్నమో, రాత్రియో, ప్రాతఃకాలమో జ్ఞాపకము రాకపోదు.

ఆనాటి సాయంత్రం ఇద్దరమూ శుభ్రంగా స్నానంచేసి సముద్రతీరాన షికారువెళ్లి ఎక్కువమంది లేనిప్రదేశం చూసుకొని అక్కడ కూర్చున్నాము. మా మాటలలో మాకు కాలగతి తెలియలేదు. వెన్నెల చలవలు చిలుకుతున్నది. ఎదుట సమీపంలోనే సముద్రము మనోహర భయంకరములైన గాథలెన్నో తనలో లీన మొనరించుకున్న ఘోషశ్రుతితో మాకు ప్రశాంతి కూరుస్తున్నది. నెమ్మదినెమ్మదిగా జనులు తగ్గిపోతున్నారు. మేము మాట్లాడుతూనే ఉన్నాము.

చంద్రుని కతని అనుభవము స్పష్టంగా జ్ఞప్తికి రాగా స్ఫుటంగా వర్ణించ సాగినాడు. ఆ సందర్భంలో చంద్రుని ప్రవర్తనలోని కోమలతకూ, ఉదాత్తతకూ నాకు విస్మయానందములు ఉద్భవించినవి. అది జరిగినరోజు లతని మనస్సులో పారినప్పుడు అతని విశాలనేత్రములలో సమస్తమూ ప్రతిఫలించగా సాక్షాత్కా

రము పొందుతున్న యోగీశ్వరుని నేత్రాబ్జములవలె అతనికన్నులు నూతనమైన దివ్యకాంతు లీనినవి. ప్రకృతి మధురమైన అతని కంఠస్వరము మరింత మధురమై సంగీతధ్వనివలె నాకు వినవచ్చినది.

కథ విని నేను ముగ్ధుడనైనాను. అతని మధు రానుభవమూ, ఆ మనోహరభావములూ అతని దివ్య మూర్తితో ఏకమై నాహృదయ మంతటినీ ఆవరించి నన్నధిష్ఠించినవి. ఇప్పుడెప్పుడైనా చంద్రుని ప్రవర్త నము కష్టముకలిగించి నాకు కోపము రాబోతున్న సమ యంలో ఆరోజుసాయంత్రం జ్ఞాపకము వస్తుంది. నామనస్సు నీరవుతుంది. ఇ దెవరికి తెలుసును! చంద్రుని కహంకారం అభివృద్ధి అయ్యేటట్లు చేస్తున్నా నని నన్ను దూషించే స్నేహితుని కిదంతా నేను ఎప్పుడూ చెప్పలేదు. చెప్పినా అతని కటువంటి అనుభవము లేక పోతే అర్థమవుతుందా? అతనికి అర్థం కాకపోతే నన్ను పిచ్చివానికింద కట్టి అపహాసము చేస్తాడు.

చంద్రుడు కథ చెప్పడము పూర్తి ఐన తర్వాత ఇద్దరమూ కొంతసేపు మాట్లాడలేదు. ఇట్లా ఎవరిభావ ముల సంపూర్ణతతో వాళ్లము కొంతసేపు నిశ్శబ్దముగా ఉన్నతర్వాత నేనే ముందు మాట్లాడినాను.

"నీ వివ్వాళ నాకు చెప్పినది చెప్పినట్లువ్రాస్తే అద్భుతమైనకథ ఔతుందని నీకు తెలుసునా?"

అప్పు డత నేమీ ప్రత్యుత్తర మీయలేదు. అతని మౌనమే పలుకులకంటె ఎక్కువ విశదముగా మాట్లాడినట్లయినది. నేనూ మౌనంగానే ఉన్నాను. అప్పుడు పొద్దుపోయినది తెలిసి నిశ్శబ్దముగాలేచి ఇంటికి బయలుదేరినాము.

అట్లాగే కథలు చెప్పుకుంటూ సాయంత్రములు షికారు వెళ్లుతూ ఉండేవాళ్లము. నాలుగురోజులైన తర్వాత చంద్రుడు "నాకు కథ వ్రాయవలె నని ఉన్నది. మీరు సహాయము చేయవలె. మునుపు కొంత వ్రాస్తూఉండేవాణ్ణే లెండి!" అన్నాడు.

చంద్రుడు లోగడ కథలు వ్రాస్తూ ఉన్నాడన్న మాట నమ్మకపోయినా అతని కథనశక్తి విషయమున నాకు సంపూర్ణ విశ్వాసము కలిగి ఉన్నందువల్ల "మును పెప్పుడూ నీవు వ్రాయకపోయినా ఇప్పుడు వ్రాస్తే బాగానే ఉంటుంది" అన్నాను.

ఆరాత్రే భోంచేసిన తర్వాత కూర్చొని కథా సంవిధానము ఆలోచించినాము. మేమిద్దరమూ చురు కుగా ఆలోచించిన కారణాన త్వరలోనే అనుసంధా నం పూర్తి ఐనది. తెల్లవారుజామున రెండు గంట లకే నిద్రపోగలిగినాము. అట్లాగే ఇంకో నాలుగైదు రాత్రిళ్లు కూర్చున్న తర్వాత అతని కథ వ్రాయడము పూర్తిఐంది. అతను వ్రాస్తున్నంతసేపూ నన్ను నిద్ర పోనిచ్చేవాడూ కాదు, చదువుకోనిచ్చేవాడూ కాదు. మాటిమాటికీ కొంత వ్రాసి చదివి వినిపిస్తూ 'బాగున్నదా' అని అడుగుతూనూ, ఏదన్నా నేను సలహా ఇచ్చినప్పుడు నిరుత్సాహపడుతూనూ, అడుగడుగుకూ ఏదో ప్రశ్న వేస్తూనూ—ఈవిధంగా వ్రాసినాడు. కాని మొత్తాన శ్రమ ఫలించింది. కథ చాలా బాగా ఉన్నది. అమూ ల్యరత్నాన్ని కనుక్కున్నందుకు గర్వముతో కూడిన సంతోషము నాకు కలిగింది.

ఆకథ అచ్చుకావడానికి కొంత ఆలస్యమే ఐంది. కాని నా కథల దురదృష్టము అతని కథనుకూడా వెంబడించలేదు. అతని కథ అచ్చయిన వెంటనే సుప్రసిద్ధులైన పండితులు, సహృదయులు దాన్ని పొగడినారు. బసవరాజు అప్పారావుగారు "ఇంత మంచి కథ ఇప్పటికి తెలుగులో చదవలే"దన్నారు.

ఆకథ వ్రాసిన తర్వాత నాకు పూర్తిగా తృప్తి లేక మూడుసార్లు తిరగ వ్రాయించినాను. చంద్రుని మొదటి కథలోకి మా ఇద్దరిలో ఎవరి అశ్రద్ధవల్లనూ ఏమాత్రము లోపమూ రాగూడదని నా ఉద్దేశము. కాని అంత శ్రమ పడ్డప్పటికీ ఆకథ చదివినవాళ్లకు ఆశ్రమ ఏమాత్రమూ కనపడదు. అతుకు లనేవి లేకుండా బంగారు కమ్మిపోసినట్లు సాఫీగా వచ్చింది. అది అచ్చయిన తర్వాత ఒకవిద్వాంసుడు చదివి ఆనందము పట్టలేక మాగదికి వచ్చి "చంద్రశేఖరంగారూ, మీ కథ బాగున్నదని చెప్పడానికి వచ్చినానండీ" అన్నారు. అప్పుడు మాటల సందర్భంలో ఆయన "ఈకథ తప్పక మీరు కూర్చున్నవారు కూర్చున్నపాళాన పూర్తిచేసే

హాకా లేకుండా వ్రాసిఉంటారు. లేకపోతే అంత బాగా రావడానికి వీలులేదు" అన్నారు.

పక్కనున్న నేనందుకొని "చంద్రా, నాకు బాగా జ్ఞాపకం లేదు. ఆకథ నీ వెంతసేపులో వ్రాశావు?" అన్నాను.

చంద్రు డేమి జవాబు చెప్పవలెనో తెలియక మాట్లాడలేదు.

"అవును, జ్ఞాపకం వచ్చింది. పొద్దున భోజనం చేసి వచ్చి కూర్చొని ఒకపూటలోనే వ్రాశాడు. మధ్య నేను కాఫీతాగుదాము రమ్మని బలవంతం చేస్తేకూడా విసుక్కుంటూ ఒక్కసారిమాత్రము అట్లా వచ్చినట్లున్నాడు" అన్నాను నేను.

"అవును కాబోలు, నెవరికి జ్ఞాపకం!" అన్నాడు చంద్రుడు.

ఆ వచ్చిన పెద్దమనిషి తనఊహ నిజమైనందుకు సంతోషించి వెళ్లి పోయినాడు. అటువంటి వాళ్లకు నిజము చెప్పి వాళ్ల నిశ్చితాభిప్రాయాలను మార్పుచేయడానికి ప్రయత్నంచేసేకంటె వాళ్ల ఉద్దేశాలతోనే సుఖంగా ఉండనీయడము మంచిదని నాకు అనుభవము వల్ల తెలిసివచ్చింది. చంద్రుడాకథ వ్రాయడానికి ఎంత కష్టపడ్డాడో తెలుస్తే ఆయన కా కథమీద గౌరవము పోవడమే కాకుండా ఆ పిమ్మట చంద్రుడు వ్రాసే కథలను "ప్రయత్నపూర్వకంగా వ్రాసినట్లు స్పష్టంగా కనపడుతున్న" వని దూషించేవాడే. నేనబద్ధమాడననే ప్రతీతికలవాణ్ణి ఐనప్పటికీ ఇటువంటి అబద్ధాలు అవసరమైతే చాలా మాట్లాడుతూ ఉంటాను.

---

చంద్రుడు కథ ఒక్కటి చక్కగా వ్రాసినతర్వాత నా కతని యెడల గల ఆదరానురాగములు అతిశయించినవి. నాకు గల ఊహ అంతా అతని కథల మీదనే ఉపయోగిస్తూ వచ్చినందున నేను కథలు వ్రాయడం మానివేశాను. ఆలోచించిన కొద్దీ చంద్రుని కథలు పెరిగిపోతున్నవి. అవన్నీ అత నెప్పుడు వ్రాస్తాడా అని అతనికంటె నాకు ఆదుర్దాఎక్కువైనది. మొదటికథ వ్రాసిన ఉత్సాహములోనే ఇంకా రెండుకథలు వ్రాసినాడు. కాని ఆ రెండూ వ్రాయడము పూర్తి అయ్యేసమయానికి అతని మనస్సులో అధమపక్షము పాతిక కథలన్నా అల్లాడుతున్నవి.

కాని త్వరలోనే మాకథలు ఆపవలసి వచ్చినది. చంద్రుని దరఖాస్తు పరీక్షలు నెలరోజులలోకి వచ్చినవి. అతను నావలె ఆరోగ్యవంతుడు కాడు కాబట్టి పరీక్షలంటే అతనికి అతిభయము. పరీక్ష దగ్గరకువస్తున్నదంటే బహుశ్రద్ధగా చదువుతాడు. స్వభావ సిద్ధముగా చురుకుదనము గలవాడు. అందువల్లనే అతను ఫస్టు క్లాసులో రావడమేకాక కొన్నిటిలో డిస్టింక్షను కూడా తెచ్చుకోగలడని నేననుకోవడము అతనిమీద నాకున్న అభిమానవశముచేతగాదని అంటాను. పరీక్షరోజుల్లోనే కాక వట్టిరోజుల్లోకూడా జాగ్రత్తగానే చదివేవాడు. చివరకు కథలు వ్రాసే రోజుల్లోకూడా అందులో కాలము వృథాఅవుతున్నదని ఆవార తక్కువ నిద్రపోయి చదువుతూ ఉండేవాడు. దరఖాస్తు పరీక్ష నెలరోజుల్లోకి వచ్చినప్పటినుంచీ చంద్రుడు నాతో "ఏమీ చదరలేదండీ!" అని మాటిమాటికీ అంటూ వచ్చినాడు. నాకందుకు ఆశ్చర్యము వేయడమేకాక "జాగ్రత్తగా చదువుకుంటున్నా ఇట్లా అంటాడేమా" అని విసుగుకూడా పుట్టసాగింది.

"మీవల్లే చదివితే మొద్దులుకూడా ఫస్టుక్లాసులో ప్యాసు కావలె"నని ఎన్నోమార్లు అన్నాను. అతని మనస్సు శాంతంగా ఉన్నవేళలలో "నిజమే, ఒక్క కెమిస్ట్రీలోతప్ప మిగిలినవాటిల్లో డిస్టింక్షను రావచ్చు. కెమిస్ట్రీలోమాత్రము ఎప్పుడూ వల్లెవేస్తుంటే తప్ప మార్కులు రావు" అంటాడు. "ఫిజిక్సు కష్టమంటారే కొంతమంది!" అని నేనంటే "అదేమున్నది?" అనేవాడు. కాని అత నిట్లా శాంతంగా ఉండే సమయాలు అరుదు. ఎంత చదివినా తృప్తిలేదు. చదివినదే చదివి అలిసిపోతాడు. "దరఖాస్తు కట్టనియ్యకపోతే నవ్వుబాట్లు కాదండీ!" అని రోజుకొక్కసారైనా అనేవాడు. అతని అధైర్యానికి నాకు సామాన్యంగా నవ్వు వచ్చేది కాని కోపముకూడా రావడం కద్దు. ఒకసారి నేను కసురుకుంటే రెండుమూడు రోజుల

దాకా ఆమాట తిరుగ అనేవాడు కాడు. కాని అతని మీద ఒక్కసారి కసురుకుంటే మళ్లీ అతను తన భయము చెప్పేదాకా నేను పశ్చాత్తాప పడేవాణ్ణి. అతని కథల ప్రశంస ఐనా రానీయకుండా చేయసాగినాను. అతనే ఎప్పుడన్నా నన్ను సంతోష పెట్టడం కోసము ఆ సంగతి ఎత్తినా "దరఖాస్తు పరీక్షలు కానియ్యి. క్రిస్టమసు సెలవుల్లో కావలసినన్ని కథలు వ్రాయవచ్చును" అనేవాణ్ణి. బీచికి షికారు ఒంటరిగానే పోసాగినాను.

అతని దరఖాస్తు పరీక్షలు పదిహేను రోజుల లోకి వచ్చినవి. ఆరోజు సాయంకాలము అకస్మాత్తుగా చెన్నపట్టణపు వర్షాకాలపు మబ్బు గాఢంగా పట్టింది. ఆకాశము ఉరుముతూ నన్నింటికి చేరుకోమని తొందర పెట్టుతున్నది.

గదికి వెళ్లేటప్పటికి సూర్యాస్తమానము కాకపోయినా చీకటిగా ఉన్నది. చీకటిగా ఉన్న ఆగదిలో ఒకమూల చంద్రు ఊరకే పండుకొని ఉన్నాడు. వెళ్లగానే నే నాశ్చర్యంతో "చదువుకోకుండా అట్లా పడుకున్నావేం ?" అన్నాను.

"ఎందుకూ చదువు ?"

"నీ మాటలు నా కర్థంకావడంలేదు. ఈ ఊరు వచ్చినది చదవడానికి కాకపోతే మరెందుకు?"

"అర్థ మయ్యే దేమున్నది? ప్యాసుకానిదానికి చదువెందుకండీ!"

"ప్యాసు కాకపోవడ మేం? ఇవ్వాళ కాఫీహోటల్లో మామూలుకంటె పావుగంట ఆలస్యమై కాలం వృథాఐందా ఏమిటి?" అని హేళనగా నవ్వినాను.

చంద్రుడు మాట్లాడలేదు.

"మాట్లాడవేం?"

"నన్ను చూస్తే మీకంత నవ్వులాటగా ఉందేం? బి. ఏ. ప్యాసైన తర్వాత ఎంతయినా నవ్వవచ్చు."

"బి. ఏ. తప్పినప్పుడుకూడా నే నేడవలేదు"

"ఇప్పుడు ఎవ రేడుస్తున్నారేం?"

ఆరోజు నానవ్వులాట అతని కెందుకో కోపము కలిగించిందని తెలుసుకొని కొళాయివద్దకు వెళ్లి కాళ్లు కడుక్కొని అతనిదగ్గరకుపోయి కూర్చున్నాను. నా ముఖాన నవ్వుపోయింది.

కొంతసేపటికి చంద్రుడు "ఏమండీ, నేనింటికి వెళ్లుతా!" అన్నాడు.

"పరీక్ష లిక పదిహేను రోజులేగా ఉన్నది! ఈమధ్య వెళ్లకపోతేనేం? ఈకొద్దిరోజులూ మీ వాళ్లను చూడకుండా ఉండలేవూ?"

"మా వాళ్లను చూసిరావలె నని కాదు. ప్యాసు కానిదానికి ఇక్కడ ఉండడ మెందుకు, దండగ!"

"నీకు దేంట్లో ప్యాసుకానని అధైర్యము?"

"అధైర్యము కాదు, ఇహ నేను ఫిజిక్సులో ప్యాసుకావడము ఉత్తమాట!"

"కెమిస్ట్రీకష్టముపోయి ఫిజిక్సులోకి వచ్చిందా?" అనేప్రశ్న పెదవులమీదికి వస్తూఉండగా చిరునవ్వు రాక తప్పింది కాదు. ఆ ప్రశ్నమాత్రము నానోట ఉచ్చరించలేదు.

"అట్లా నవ్వుతా రెందుకు, మీకు పిచ్చా? నవ్వితే నాకు కోపం. మీ రడగబోయే ప్రశ్న నాకు తెలుసు. కెమిస్ట్రీ ఈమధ్య బాగా చదివినాగా! చదవకపోతేమాత్రం ప్యాసుమార్కులు రావనా?"

"ఐతే ఫిజిక్సులో నేనా ప్యాసుమార్కులు రానిది?"

చంద్రు డొక్కక్షణం సందేహించి, కోపంతో బిగ్గరగా "ఎట్లా వస్తవేం, ఫిజిక్సు లెక్చరరుతో పోట్లాడితే?" అన్నాడు.

ఇంత శాంతస్వభావుడూ, చదువుమీద ఇంత శ్రద్ధగలవాడూ లెక్చరరుతో ఎట్లా పోట్లాడినాడా అని నాకు తెలుసుకోవలెనని కుతూహలం కలిగింది. చివరకు విచారించగా, ఆరోజున ఎక్స్పెరిమెంటుచేసి చూపగా లెక్చరరు అత నది కాపీచేసినాడని అనుమానించినట్లూ, అందుమీదట ఇతను "నేను కాపీచేసేవాణ్ణి కాదు. ఈకాస్త ఎక్స్పెరిమెంటుకే కాపీచేసే నీచానికి

పోల్పడవలెనా?" అని కటువుగా అన్నట్లూ, ఆయన ముఖము చిట్లించినట్లూ తెలిసింది.

కథ అంతా విని "ఇంతేకదా!" అని ఫక్కున నవ్వినాను. ఫక్కుమని నేను నవ్వేటప్పటికి చంద్రుడికి అరికాలిమంట నెత్తి కెక్కింది. అతనికి కోపము వచ్చిన కొద్దీ నా నవ్వెక్కువైంది. నానవ్వు మరీ ఎక్కువైన తర్వాత అతనికి కోపము శాంతించింది. "మీ రట్లా నవ్వుతుంటే నాకు కష్టంగా ఉంటుందండీ!" అన్నాడు.

ఆ మాటలకు నాకు జాలివేసి "పిచ్చి శేఖరం, ఇవ్వాళ బయటికి షికారువెళ్లుదాం రా! కొస్త నడిచి వస్తే నీభయం తీరుతుంది. నీతో షికారువెళ్లి చాలా రోజు లైందికూడాను" అన్నాను.

"మీరు వెళ్లండి, నేను రాలేను"

"నేను చెప్పినాను కొబట్టిఐనా కొస్త ఇవ్వాళిటికి రా! పరీక్ష పోయేది పోనేపోతుంది, కులాసాగా ఐనా ఉందువుగాని!" అని బతిమాలినాను.

"పరీక్షతప్పితే నామర్దా కాదండీ! లోకాన్ని మళ్లీ ఎట్లాచూస్తాము ?"

"ఆ సిగ్గంతా తప్పేదాకానే. ఒకసారి తప్పిన తర్వాత అంతాపోతుంది. పాపిష్ఠి లోకము మననేమి చేయగలదు !"

"నాకు ధైర్యంకోసము మీరట్లా అంటారు లెండి!"

"ధైర్య మేమిటోయి? వృథాగా నీమీద టీచరు అనుమానపడి అవమానకరంగా మాట్లాడడం బాగున్నది కాని, నీవు విసుగుగా మాట్లాడడం తప్పయిందేం? ఇంతమాత్రానికే తప్పిస్తాడటోయి! బాగా పేపరువ్రాస్తే ఎంతకసిఉంటే మాత్రం టీచరు ఎవరికోసం మార్కులు వేస్తాడు? నాకూ ఇందులో కొంత స్వానుభవ మున్నదిగా!"

"ఏమో మరి! మా కాలేజిసంగతులు మీకేం తెలుసు?

"మీ కాలేజి సంగతులు తెలుపుదువుగాని లే"అని బలవంతాన లేవదీసి నిలుచోబెట్టి బుజంమీద ఉత్తరీయంవేసి అతనితోకలిసి ఆరోజు షికారు వెళ్లినాను.

మా అదృష్టాన ఆరోజు వానరాలేదు. ఇంటికి వచ్చినతర్వాత చంద్రుడు యథాప్రకారం చదువు సాగించినందుకు నాకు సంతోషమయింది. ఆపైన ఎప్పుడు చూసినా సామాన్యంగా అతని చేతిలో ఫిజిక్సు పుస్తకా లుంటూ వచ్చినవి.

అతని ఇక పరీక్షలు నాలుగైదురోజు లున్న వనగా నాకు తీవ్రంగా జ్వరము వచ్చింది. స్వగ్రామం బయలుదేరినాను. చంద్రుడు తీరిక చేసుకొని నన్ను పంపడానికి స్టేషనుదాకా వచ్చినాడు. అక్కడ చాలా ఆదరంగా మాట్లాడుకున్నాము. చాలాకాలము కలిసి ఉన్న స్నేహితులు విడిచివెళ్లేటప్పుడు అనుభవించే కష్ట మనుభవించినాము. రైలు కదలబోయే సమయంలో నేను "పిచ్చిభయం పెట్టుకోక పేపర్లు బాగా వ్రాయి! మన ఊరు వచ్చేటప్పటికి నీవు కళకళ లాడుతూ ఉన్న ముఖంతో నాకు కనిపించవలె! నా జ్వరం ఇంటికి పోగానే నయమవుతుంది" అన్నాను.

"దరఖాస్తు పెట్టిస్తేనా? పై పరీక్ష కసలు భయపడను. అందులో ఫస్టుక్లాసు తప్పదు" అని చంద్రుడు ఉత్సాహంగా పలికినాడు.

నేను మా ఊరు వచ్చిన కొద్దిరోజులకే అతను ఫిజిక్సుపేపరు పాడుచేశాడనీ, దరఖాస్తు కట్టించరని దిగులుపడుతున్నాడనీ తెలియవచ్చింది. చివర కొక రోజున చంద్రుడి దగ్గరనుంచి ఉత్తర మిట్లా వచ్చింది:

"నన్ను దరఖాస్తు కట్ట నిచ్చారు. కాని ఫిజిక్సులో వచ్చేటక్కులో జాగ్రత్తగా ఉండవలెనన్నారు. మా టీచరుల కసి సంగతి మీకు చెప్పలేదా ?"

చంద్రుడు స్వగ్రామము వచ్చిన తర్వాత "నీవు ఫిజిక్సుపేపరు చెడగొట్టడానికి కారణమేమిటి?" అని అడిగినాను.

"ఏమో !"

"బాగా చదవలేదా?"

"నేను చదివినట్లు ఎవరూ చదివి ఉండరు"

"ప్రశ్న లెట్లా ఉన్నవి?"

"అన్నీ తెలిసినవే"

"ఐతే?"

"ఐతే" అనే ప్రశ్నే నాకు జవాబిచ్చినాడు.

అంతా అవ్యక్తంగా ఉన్నది. మనుష్యయత్నానికి అతీతమైన శక్తి ఏదో ఆ కుఱ్ఱవాని బలహీన మనస్సును స్వాధీనపరచుకొన్నట్లు నాకు తోచింది.

(సశేషము)

